ఎన్టీఆర్-నీల్ ఆగస్ట్‌లో షురూ

ఎన్టీఆర్, ప్రశాంత్‌నీల్ కాంబినేషన్ ప్రకటన వచ్చిన నాటినుంచీ.. సినిమా ఎప్పుడెప్పుడు మొదలవుతుందా.. థియేటర్లలో సినిమాను ఎప్పుడు చూస్తామా.. అని అభిమానులు, సినీప్రియులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఎట్టకేలకు వారి ఎదురు చూపులు ఫలించాయి. ఎన్టీఆర్, ప్రశాంత్‌నీల్ సినిమాకు సంబంధించిన అప్‌డేట్ వచ్చేసింది. 'ఎన్టీఆర్‌నీల్' అనే వర్కింగ్ టైటిల్‌తో ఈ సినిమా షూటింగ్ ప్రారంభం కానున్నట్టు సోమవారం మేకర్స్ ప్రకటించారు. ఎన్టీఆర్ పుట్టినరోజు సందర్భంగా ఈ ప్రకటన విడుదల చేశారు. ఈ సినిమా షూటింగ్‌ను ఈ ఏడాది ఆగస్టులో ప్రారంభించనున్నట్టు అభిమానులకు తీపి కబురు చెప్పారు మేకర్స్. ప్రస్తుతం ప్రశాంత్‌నీల్ ఈ సినిమాకు సంబంధించిన స్క్రిప్ట్ పనుల్లో బిజీగా ఉన్నారట. అది కూడా చివరిదశకు చేరుకుందట. తారక్ మాస్ ఇమేజ్‌ని దృష్టిలోపెట్టుకొని, 'కేజీఎఫ్' ఫ్రాంచైజీకి దీటుగా భారీ స్కేల్‌తో, అద్భుతమైన సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్ ఇచ్చేలా ఈ సినిమా తెరకెక్కనుందని మేకర్స్ చెబుతున్నారు. మైత్రీ మూవీమేకర్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ పతాకాలపై ఈ సినిమా రూపొందనుంది. సినీప్రియులు, అభిమానుల అంచనాలను మించేలా ఈ సినిమా ఉండబోతున్నదని మేకర్స్ చెబుతున్నారు.

ఆలోచనా ధోరణి మారాలి

ఆధునిక సమాజంలో శరీరాకృతి, వర్ణం ఆధారంగా కనబరిచే వివక్షను అంతం చేయాలని కోరింది అగ్ర కథానాయిక మృణాల్ ఠాకూర్. బాడీషేమింగ్ (శరీరాకృతిని అవహేళన చేయడం) అత్యంత హేయమైన చర్య అని ఆమె అభిప్రాయపడింది. అందం, వర్ణం వంటి విషయాలతో సంబంధం లేకుండా మంచి గుణం ఆధారంగానే వ్యక్తులకు విలువనివ్వాలని చెప్పింది. సీతారామం, హాయ్ నాన్న వంటి చిత్రాలతో ప్రేక్షకులకు చేరువైన ఈ మరాఠి సుందరి ప్రస్తుతం తెలుగు, తమిళ భాషల్లో మంచి అవకాశాలను దక్కించుకుంటున్నది. ఈ నేపథ్యంలో సోషల్‌మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్, నటి డాలీసింగ్‌కు మద్దతుగా మృణాల్ ఠాకూర్ ఇటీవల ఓ ఇంటర్వ్యూలో చెప్పిన మాటలపై సోషల్‌మీడియాలో ప్రశంసలొస్తున్నాయి. శారీరక ఆకృతిలో క్రమంగా చోటు చేసుకునే హెచ్చుతగ్గుల వల్ల తాను ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నానని డాలీసింగ్ సోషల్‌మీడియా ద్వారా ఆవేదన వ్యక్తం చేసింది. ఈ విషయంలో ఆమెకు మద్దతుగా నిలిచింది మృణాల్ ఠాకూర్. 'శరీరాకృతిపై చేసే అవహేళన క్షమించరానిది. ఈ విషయంలో ప్రజల ఆలోచనా ధోరణి మారాలి. శరీరం గురించి కాదు మంచి మనసు గురించి మాత్రమే ఆలోచించాలి' అని మృణాల్ ఠాకూర్ పేర్కొంది.

గాడ్‌ఫాదర్ దర్శకుడితో ఇంకోసారి

చిరంజీవి 'గాడ్‌ఫాదర్' సినిమా చూసినవారందరూ దర్శకుడు మోహన్‌రాజా స్టైలిష్ మేకింగ్ గురించి ప్రత్యేకంగా మాట్లాడుకున్నారు. చిరంజీవిని 'గాడ్‌ఫాదర్'గా చూపించడంలో వందశాతం సఫలీకృతుడయ్యారు డైరెక్టర్ మోహన్‌రాజా. అందుకే ఫలితానికి అతీతంగా అతనిపై ప్రశంసల వర్షం కురిపించారు మెగాస్టార్. ఆ ఇష్టంతోనే మరో అవకాశం కూడా ఇచ్చేసినట్టు ఫిల్మ్ సర్కిల్స్‌లో బలంగా వార్తలు వినిపిస్తున్నాయి. చిరంజీవి కుమార్తె సుస్మిత పేరిట ఏర్పాటు చేసిన కొత్త నిర్మాణ సంస్థలో చిరంజీవి సినిమా చేయనున్నట్టు గతంలో ప్రకటించారు. ఆ సంస్థ నిర్మించే తొలి చిత్రానికి కల్యాణ్‌కృష్ణ దర్శకత్వం వహించనున్నట్టు గతంలో వార్తలు వచ్చాయి. ఆ తర్వాత దీనికి సంబంధించిన విషయాలేం బయటకు రాలేదు. అందుతున్న సమాచారం మేరకు ఈ సంస్థ తొలి చిత్రాన్ని తెరకెక్కించే బాధ్యతను మోహన్‌రాజాకు అప్పగించినట్లు తెలుస్తున్నది. స్క్రిప్ట్ నెరేషన్ పూర్తయిందని, చిరంజీవి కూడా పచ్చజెండా ఊపేశారని విశ్వసనీయ వర్గాల సమాచారం. త్వరలోనే ఈ సినిమాకు సంబంధించిన వివరాలు వెల్లడికానున్నాయ్.

అండమాన్ దీవుల నేపథ్యంలో..

విజయ్ ఆంటోని కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'తుఫాన్'. విజయ్ మిల్టన్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇన్ఫినిటీ ఫిల్మ్ వెంచర్స్ పతాకంపై కమల్ బోరా, డి.లలితా, బి.ప్రదీప్, పంకజ్ బోరా నిర్మిస్తున్నారు. దర్శకుడు చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'పొయిటిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్ జోనర్‌లో ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నాం. తనను చిన్నచూపు చూసే సమాజాన్ని సంస్కరించి వ్యవస్థలో మార్పులు తీసుకొచ్చే వ్యక్తి కథ ఇది. ఓ దివి నేపథ్యంలో కథ సాగుతుంది. అండమాన్ మరియు డయ్యూడామన్‌లలో చిత్రీకరణ జరిపాం. ప్రస్తుతం షూటింగ్ తుదిదశలో ఉంది. ఈ నెల 29న టీజర్‌ను విడుదల చేయబోతున్నాం' అని తెలిపారు. శరత్‌కుమార్, సత్యరాజ్, డాలీ ధనుంజయ, మేఘా ఆకాష్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: అచ్చు రాజమణి, విజయ్ ఆంటోని, సంభాషణలు: భాష్యశ్రీ, రచన-సినిమాటోగ్రఫీ-దర్శకత్వం: విజయ్ మిల్టన్.

క్రైమ్, కామెడీ గం గం గణేశా

'నేను ఇప్పటివరకూ రియలిస్టిక్, నేచురల్ సినిమాలే చేశా. 'గం గం గణేశా'లో తొలిసారి ఎనర్జిటిక్ కేరక్టర్‌తో వస్తున్నా. ఇది టిపికల్ జోనర్. క్రైమ్, కామెడీ నేపథ్యంతో కూడిన కథ. ఎక్స్‌ప్రెస్‌రాజా, రన్‌రాజారన్, స్వామిరారా, ఏజెంట్ సాయిశ్రీనివాస్ ఆత్రేయ.. ఈ తరహా సినిమాలు చూసిన ఫీల్ కలుగుతుంది. నా ప్రీవియస్ మూవీ 'బేబీ'తో అస్సలు పోలికుండదు. అందరి మంచి కోరుకునే మనసున్న వ్యక్తి మా దర్శకుడు ఉదయ్. ఈ సినిమా ఆయనకే కాదు, టీమ్ మొత్తానికి పెద్ద బ్రేక్‌గా నిలుస్తుంది' అని ఆనంద్ దేవరకొండ అన్నారు. ఆయన కథానాయకుడిగా రూపొందిన చిత్రం 'గం గం గణేశా' ఈ నెల 31న సినిమా విడుదల కానుంది. ప్రమోషన్‌లో భాగంగా ఈ సినిమా ట్రైలర్‌ని విడుదల చేశారు. రచయిత విజయేంద్రప్రసాద్, దర్శకులు వంశీ పైడిపల్లి, సాయిరాజేశ్ అతిథులుగా హాజరై చిత్ర యూనిట్‌కి శుభాకాంక్షలు అందించారు. ఇంకా యూనిట్ సభ్యులందరూ మాట్లాడారు. ప్రగతి శ్రీవాస్తవ, నయన్ సారిక కథానాయికలుగా నటిస్తున్న ఈ చిత్రంలో కరిష్మ, వెన్నెల కిశోర్, సత్యం రాజేశ్, జబర్దస్త్ ఇమ్మాన్యుయేల్ ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: ఆదిత్య జవ్వాడి, సంగీతం: చేతన్ భరద్వాజ్.

మనోజ్ ది బ్లాక్ స్వార్డ్

'దాదాపు ఎనిమిదేళ్ల తర్వాత మళ్లీ వెండితెరపైకి వస్తున్నాను. ఏదైనా కొత్తగా డిఫరెంట్‌గా చేయడం నాకిష్టం. అందుకే డబ్బుకోసం కాకుండా నచ్చిన సినిమాలనే వెతుక్కుంటూ వెళ్లాను. మళ్లీ సినిమాను చేయాలనుకున్నప్పుడు చాలా కథలు విన్నాను. ఓపికగా ఎదురు చూశాను. అలాంటి సమయంలో దర్శకుడు కార్తీక్ ఈ కథ చెప్పాడు.' అని మంచు మనోజ్ తెలిపారు. ఎనిమిదేళ్ల విరామం తర్వాత ఆయన నటిస్తున్న చిత్రం 'మిరాయ్'. ఇందులో మనోజ్ ప్రతినాయకుడిగా నటిస్తున్నట్టు సమాచారం. ఈ చిత్రంలోని మనోజ్ లేటెస్ట్ అవతార్‌ని మేకర్స్ రివీల్ చేస్తూ, 'మంచు మనోజ్ ది బ్లాక్ స్వార్డ్'గా ఫస్ట్‌లుక్ గ్లింప్‌ను హైదరాబాద్‌లో లాంచ్ చేశారు. ఈ గ్లింప్‌లో మనోజ్ అత్యంత పవర్‌ఫుల్‌గా కనిపిస్తున్నారు. మనోజ్ ఇంకా మాట్లాడుతూ 'తేజ సజ్జాకి థ్యాంక్స్ చెప్పాలి. 'ఈ సినిమాలో నువ్వు, నేను చేయాలి అన్నా.. కథ విను' అని అడిగాడు. ముచ్చటగా అనిపించింది. కథ అయితే నెక్ట్స్ లెవల్. ఇది రెండు పార్టులుగా వస్తుంది. తొలి పార్ట్ వచ్చే ఏడాది ఏప్రిల్ 18న విడుదల అవుతుంది. ఓ చారిత్రాత్మక నేపథ్యం చుట్టూ తిరిగే ఈ కథను కార్తీక్ అద్భుతంగా మలిచాడు.' అని తెలిపారు మంచు మనోజ్. ఇంకా యూనిట్ సభ్యులందరూ మాట్లాడారు. సూపర్‌యోధగా తేజ సజ్జా నటిస్తున్న ఈ చిత్రానికి కార్తిక్ ఘట్టమనేని దర్శకుడు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు.

మల్లెమొగ్గ పండుగలో తథాస్తు

రామ్‌తేజ్, వర్షిణి, మౌనిక ప్రధానపాత్రధారులుగా రూపొందిన చిత్రం 'మల్లెమొగ్గ'. తోట వెంకటనాగేశ్వరరావు స్వీయ దర్శకత్వంలో నిర్మించిన ఈ చిత్రం ఇటీవలే విడుదలైంది. ఈ సినిమా సక్సెస్‌మీట్‌ని హైదరాబాద్‌లో నిర్వహించారు. అలాగే, రామ్‌తేజ్ హీరోగా ఈ సంస్థ నిర్మిస్తున్న కొత్త చిత్రం 'తథాస్తు' పోస్టర్‌ని కూడా ఇదే వేడుకలో విడుదల చేశారు. నిర్మాతల మండలి అధ్యక్షుడు కె.ఎల్.దామోదరప్రసాద్, సీనియర్ దర్శకుడు చంద్రమహేశ్ అతిథులుగా హాజరై చిత్ర యూనిట్‌కి శుభాకాంక్షలు అందించారు. తాను నటించిన 'మల్లెమొగ్గ' సినిమా ప్రేక్షకాదరణ పొందడం ఆనందంగా ఉందని సీనియర్ నటుడు భానుచందర్ అన్నారు. 'మల్లెమొగ్గ' సినిమాలాగే తన రాబోవు సినిమాలను కూడా ప్రేక్షకులు ఆదరిస్తారని హీరో రామ్‌తేజ్ ఆశాభావం వెలిబుచ్చారు. ఇంకా చిత్ర యూనిట్ మొత్తం మాట్లాడారు.

సోషియో ఫాంటసీ కథాంశం

హర్ష రోషన్, కార్తికేయ దేవ్, స్టీవెన్ మధు ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'టుక్ టుక్'. సుప్రీత్ సి కృష్ణ దర్శకుడు. చిత్రవాహిని, ఆర్‌వైజీ పతాకాలపై రాహుల్ రెడ్డి, సాయివరుణ్, శ్రీరాములు రెడ్డి నిర్మించారు. సోమవారం కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు. ఇందులో ముగ్గురు యువకులు ఒక ఆటో బొమ్మను ఆసక్తిగా పరిశీలిస్తున్నారు. దర్శకుడు మాట్లాడుతూ 'గ్రామీణ నేపథ్య చిత్రమిది. కథలో ఆటోకు ఉన్న ప్రాధాన్యం ఏమిటి అనే అంశం ఆసక్తికరంగా ఉంటుంది. ఫాంటసీ ఎలిమెంట్స్ ప్రధానంగా ఆకట్టుకుంటాయి. కథ, కథనాల పరంగా ప్రేక్షకులకు కొత్త అనుభూతినందించే చిత్రమవుతుంది' అన్నారు. సాన్వీ మేఘన, నిహోల్ కోదాటి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: కార్తీక్ సాయికుమార్, సంగీతం: సంతు ఓంకార్, దర్శకుడు: సుప్రీత్‌కృష్ణ.

బ్యాంక్ ఆఫ్ భాగ్యలక్ష్మి

దీక్షిత్‌శెట్టి కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'బ్యాంక్ ఆఫ్ భాగ్యలక్ష్మి'. తెలుగు, కన్నడ భాషల్లో తెరకెక్కిస్తున్న ఈ చిత్రానికి అభిషేక్ ఎమ్ దర్శకుడు. బృందా ఆచార్య కథానాయికగా నటిస్తున్నది. శ్రీదేవి ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై హెచ్.కె.ప్రకాష్ నిర్మిస్తున్నారు. సోమవారం టైటిల్‌ను ప్రకటించడంతో పాటు ఫస్ట్‌లుక్‌ని విడుదల చేశారు. దర్శకుడు మాట్లాడుతూ 'క్రైమ్ కామెడీ థ్రిల్లర్ కథాంశమిది. స్క్రీన్‌ప్లే ప్రధానంగా అనూహ్యమలుపులతో ఆకట్టుకుంటుంది. దీక్షిత్‌శెట్టి పాత్ర కొత్త పంథాలో ఉంటుంది. ఈ నెల 25న టీజర్‌ను విడుదల చేస్తాం' అన్నారు. ఈ చిత్రానికి కెమెరా: అభిషేక్ జే, సంగీతం: జుధాన్ శాండీ, రచన-దర్శకత్వం: అభిషేక్ ఎమ్.

బిగ్ బ్రదర్ యాక్షన్

శివ కంఠంనేని కథానాయకుడిగా గోసంగి సుబ్బారావు దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'బిగ్ బ్రదర్'. కె.శివశంకర్‌రావు, ఆర్.వెంకటేశ్వరరావు నిర్మాతలు. ఈ నెల 24న సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా ప్రీరిలీజ్ వేడుకను హైదరాబాద్‌లో నిర్వహించారు. ప్రముఖ నటులు మురళీమోహన్, నిర్మాతల మండలి అధ్యక్షుడు కె.ఎల్.దామోదర ప్రసాద్, సీనియర్ జర్నలిస్ట్ ప్రభు ఈ కార్యక్రమానికి అతిథులుగా విచ్చేసి చిత్ర యూనిట్‌కి శుభాకాంక్షలు అందించారు. ఈ సినిమాలో నటించడం పట్ల హీరో శివ కంఠంనేని ఆనందం వెలిబుచ్చారు. యాక్షన్ ఎంటర్‌టైనర్స్‌ని ఇష్టపడేవారికి 'బిగ్ బ్రదర్' తప్పకుండా నచ్చుతుందని నిర్మాతలు నమ్మకం వ్యక్తం చేశారు. ఇంకా చిత్ర యూనిట్ అంతా మాట్లాడారు. ఈ చిత్రానికి కెమెరా: ప్రకాశ్.

ఇక మా కలలన్నీ వాడికోసమే

నటి యామి గౌతమ్ పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. ఈ విషయాన్ని ఆమె భర్త ఆదిత్యధర్ సోషల్‌మీడియాలో షేర్ చేశారు. ఆ బాబుకి 'వేదవిద్' అని నామకరణం చేసినట్టు ఆయన ఆ పోస్ట్‌లో తెలియజేశారు. ఈ విషయంపై యామి గౌతమ్ కూడా తన ఆనందాన్ని అభిమానులతో పంచుకుంది. 'ఇప్పటివరకూ ఒక ప్రయాణం.. ఇక నుంచి మరో ప్రయాణం. నా బిడ్డను తొలిసారి చూసుకున్నప్పుడు కలిగిన ఆనందాన్ని మాటల్లో చెప్పలేదు. ఇక మా జీవితం వాడికోసమే. మా కలలన్నీ వాడికోసమే. మా కుటుంబానికే కాక, దేశానికే గర్వకారణం అయ్యేలా వాడ్ని పెంచుతాను. వాడెన్నో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆశిస్తున్నా' అంటూ పేర్కొన్నది యామి గౌతమ్. తల్లి అయిన యామి గౌతమ్‌కి అభిమానులేకాక, సెలబ్రిటీలు సైతం శుభాకాంక్షలు చెబుతున్నారు.